● రైతన్నా మేమున్నాం



## బీఆర్ఎసోళ్లు ధైర్యం చెప్పిండ్రు..



బేల, జనవరి 27 : కాంగ్రెసోళ్లు రైతులను నమ్మించి ముంచిండ్రు. ఎలక్షన్ టైంలో అది చేస్తాం ఇది చేస్తాం అని.. చివరకు నమ్మించి మోసం చేయడమే కాకుండా.. గ్రామాల్లో గ్రామ సభలు పెట్టి ఆశలు పెట్టడం తప్ప ఏం చేసుడు లేదు. కానీ చనిపోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ వాళ్లు మా ఊరికి వచ్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చి ధైర్యం చెప్పిండ్రు. వచ్చే ఎలక్షన్‌లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం. రైతులకు అండగా ఉన్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే.

*- శంకర్, రైతు, రేణిగూడ గ్రామం, బేల మండలం*

## రుణ మాఫీ కాలే.. మాకు పైసా రాలే



బేల, జనవరి 27 : ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి రూ.2 లక్షల రుణమాఫీ మాకు ఇంకా కాలేదు. నాకు రూ.2 లక్షల పైగా అప్పు ఉంది. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంక్ అధికారులు సతాయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇస్తానన్న పథకాలు మాకు ఇయ్యాలి. రైతు భరోసా కింది రూ.15 వేలు ఇస్తామని ఎగ్గొట్టిండు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇస్తామని ఇయ్యలే. కేసీఆర్ సారే బాగుండే మాకు. బీఆర్ఎస్ కమిటీ వచ్చి ఆత్మహత్య రైతు చేసుకున్న కుటుంబాన్ని ఓదార్చి లక్ష రూపాయలు ఇచ్చి అండగా నిలిచిండ్రు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఏమీ ఇయ్యలే.

*- హాన్ దశరథ్, రైతు, రేణుగూడ, బేల మండలం*

## రైతుల బాధలు తెలుసుకున్నరు..



బేల, జనవరి 27 : బీఆర్ఎస్ పార్టీ అధ్యయన కమిటీ మా గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావ్ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యాన్నిచ్చింది. గ్రామంలోని రైతులందరి బాధలను అడిగి తెలుసుకున్నది. అప్పులు అందరికీ ఉంటాయి. ధైర్యంతో ముందుకు సాగాలని చెప్పింది. బీఆర్ఎస్ అధ్యయన కమిటీ మా గ్రామ రైతులందరికీ ధైర్యాన్నిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదైనా మాకు ఏం ఇయ్యాలే. ఇస్తదని భరోసా కూడా లేదు. రైతుల గోస తెలిసిన నాయకుడు కేసీఆర్ ఒక్కడే ఉండే. ఇప్పుడు ఇగో ఇస్తాం.. అగో ఇస్తాం అని.. ఆశ చూపెట్టి రైతులకు మోసం చేస్తున్నరు. నాకు 4 ఎకరాల భూమి ఉంది. నాకు ఒక్క రూపాయి కూడా రాలే.

*- విఠల్ రైతు, రేణిగూడ గ్రామం, బేల మండలం*

## ఈ సర్కారుతో అరిగోస పడుతున్నం..



భీంపూర్, జవనవరి 27 : మాకు 3 ఎకరాల భూమి ఉన్నది. పత్తి, కంది సాగు చేస్తున్నం. కేసీఆర్ సారు ఉండగా మాకు గానీ.. తోటి రైతులకు గానీ ఏ రంది (బాధ) లేకుండే. అప్పుడు మేము పంట పెట్టుబడికి బాకీలు తెచ్చుడే మర్చిపోయినం. ఇప్పుడు మళ్లా దళారుల దగ్గరికే పోతున్నం. ఇపుడున్న కాంగ్రెస్ సర్కారుతో రైతులకు అరిగోస అవుతున్నది. మొన్నటి ప్రజాపాలన, సర్వేలు మాకు విసుగు తెప్పిస్తున్నాయి. పోనీ ఇన్నిసార్లు సర్వేలు చేసి ఏమన్నా పథకాలు ఇస్తున్నరా అంటే అదీ లేదు. మా కుటుంబానికి కొత్తగా ఏ పథకాలు అందలేదు. ఆఖరికి రైతుభరోసా కూడా రాలే. గీ సర్కారుతో చిన్న రైతులకు ఇంకా కష్టమవుతున్నది. ఇగ ఇప్పడందరూ అప్పటి కేసీఆర్ సార్ పాలననే మంచిగా ఉండే అని గుర్తుకు తెచ్చుకుంటున్నరు.

*- పాలెపు అశోక్, రైతు, యాపల్‌గూడ , ఆదిలాబాద్ రూరల్ మండలం*



శుక్రవారం బేల మండలంలోని రేణిగుంట గ్రామంలో దేవరావ్ జాదవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

## బీఆర్ఎస్ అధ్యయన కమిటీతో ధైర్యం..



భీంపూర్, జనవరి 27 : జైనథ్ మండలం గిమ్మ నుంచి మేము చాలా మంది రైతులం యాపల్‌గూడకు వచ్చి బీఆర్ఎస్ అధ్యయన కమిటీ నాయకులతో మా ఇబ్బందులు చెప్పుకున్నాము. మా గ్రామంల 1422 మంది రైతులు పంటరుణాలు తీసుకున్నరు. మొత్తంగా 392 మందికే రుణమాఫీ చేశారు. మిగతా రైతులంతా పరేషాన్ అవుతున్నరు. ఇక మా గ్రామంలా భూమి లేని నిరుపేదలకు ఒక్కరికీ ఆత్మీయ భరోసా జాబితాలో పేరు రాలేదు. వారు ప్రభుత్వం సూచించిన 2023లో 20 రోజుల ఉపాధి పనులకు వెళ్లలేదని ఇలా చేశారు. భూమి లేని నిరుపేదలు అనారోగ్యంతో ఉన్నా.. ఇంకా ఏవైనా పనులున్నా ఉపాధి పనులకు వెళ్లడం కష్టమైతది. ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పథకానికి లింకు ఏమిటో అర్థం కావడం లేదు. ఈ రకంగా కాంగ్రెస్ సర్కారుతోని రైతులు, కూలీలకు ఎదురవుతున్న కష్టాలను మేము అధ్యయన కమిటీ వారికి చెప్పినం. యాపల్‌గూడ, రామాయి గ్రామాల్లో పంట చేలకు వెళ్లి ఓపికగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు అండగా ఉంటామని మాజీ మంత్రి జోగురామన్న, నాయకులు చెప్పిన మాటలు మాకు ధైర్యాన్ని ఇచ్చాయి. ఎట్లాగూ వచ్చేది బీఆర్ఎస్ సర్కారేనని నమ్మకం కలిగింది.

*- కోల భోజన్న , గిమ్మ, జైనథ్ మండలం*

# అధ్యయన కమిటీ ఆత్మస్థైర్యం నింపింది

**ఆదిలాబాద్ జిల్లా పర్యటనపై రైతుల అభిప్రాయం**

- కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే నట్టేట ముంచిందని ఆవేదన
- రుణమాఫీ కాక.. సకాలంలో రైతు భరోసా రాక అరిగోస పడుతున్నామని మండిపాటు
- బీఆర్ఎస్‌తోనే రైతుకు మేలని స్పష్టం

**"కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే నట్టేట ముంచింది. రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తమన్నది.. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలిస్తమని చెప్పి మోసం చేసింది. అసలు గీ ప్రభుత్వ పథకాలేమిటో అర్థమైతలేదు. అప్పడేమో రైతుల మీద ప్రేమున్నట్లు అన్నీ ఇస్తమని చెప్పింది. ఇప్పడేమో సర్వేలంటూ సాగదీస్తున్నది. గింత వరకూ ఏ ఒక్క పథకం ఇచ్చింది లేకపాయే. కేసీఆర్ సర్కారు ఉన్నప్పడు కొండంత ధైర్యం ఉండే. గిసొంటి గోస లేకుండే. సకాలంలో రైతులందరికీ రైతు బంధు కింద పంట సాయమందించిండు. రుణమాఫీ చేసిండు. రంది లేకుంట ఎవుసం చేసుకొని బతికినం.' మళ్లా బీఆర్ఎస్ సర్కారే వస్తది. మాకు మంచి రోజులొస్తయి.'' అని ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ పర్యటించిన సందర్భంగా పలువురు రైతులు 'నమస్తే తెలంగాణ'తో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు ఏర్పాటైన బీఆర్ఎస్ అధ్యయన కమిటీ అన్నదాతల్లో ఆత్మస్థైర్యం నింపిందని, ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కొండంత అండగా నిలిచిందని తెలిపారు.**

*- మంచిర్యాల, జనవరి 27*
*(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

## ఎవరికీ రాలే..



భీంపూర్, జవనవరి 27 : అసలు మాకు కాంగ్రెస్ సర్కారు పథకాలే అర్థం కావడం లేదు, ఆత్మీయ భరోసా అనేది భూమి లేని పేదలకు. న్యాయంగా నైతే అర్హులందరికీ ఇవ్వాలి. అందరికీ ఇయ్యలేక ఈ పథకానికి ఉపాధి పనులకు 2023ల 20 రోజులైనా వెళ్లాలని నిబంధన పెట్టారు. దీంతో మా గ్రామంల ఎందరో మంది పేదలకు ఈ పథకం అందే అవకాశం లేదు . ఈ పథకం చిన్న సన్నకారు రైతులకు ఇస్తే మేలు జరిగేది. ఇగ రైతుభరోసా 26 జనవరి అర్ధరాత్రి నుంచి ఇస్తమన్నారు. ఎవరికీ రాలేదు. అది ఇస్తారన్న నమ్మకం లేదు. గ్రామంలా ఇందిరమ్మ ఇండ్లకు ఎందరు దరఖాస్తు పెడితే అందరి పేర్లు లిస్టుల ఉన్నయి. ఆఖరికి ఇచ్చేదెందరికో. ? ఇపుడు మండలానికి ఒక్క గ్రామంలనే ఐదు, పది మాత్రమే రేషన్ కార్డులిచ్చిండ్రు. వీటిపై ఇప్పుడే బియ్యం ఇస్తరన్న నమ్మకం లేదు. ఇగ మొన్న బీఆర్ఎస్ అధ్యయన కమిటీ అచ్చినంక మాకే గాదు గ్రామంలా అందరికీ కొంత ధైర్యం అచ్చింది. మళ్లా బీఆర్ఎస్ సర్కారే వచ్చేలా ఉన్నది.

*- విఠల్, రైతు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం*

## బీఆర్ఎస్ లీడర్లు మా బాధలు తెలుసుకున్నరు..



భీంపూర్, జనవరి 27 : కాంగ్రెస్ సర్కారు వచ్చినంక మా కుటుంబానికి ఏ పథకం రాలే. నేను చిన్న రైతును. 3 ఎకరాల్లో సాగు చేసుకుంటూ బతుకుతున్న. ఆదిలాబాద్ మహారాష్ట్ర బ్యాంకులో రూ. 2.40 లక్షల పంట రుణం ఉన్నది. రెన్యువల్ చేసినం. ఇగ రూ.2 లక్షల లోపల ఉన్న మస్తు మంది రైతులకు మాఫీ కాలేదు. మాకు అయితదనే నమ్మకం లేదు. రైతుభరోసా వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబితే తెల్లారే దాకా చూసిన రాలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు రైతు బంధు సాయాన్ని పంటలు సాగు చేసే టైంకి జమ చేసిండు. రైతుబంధు వస్తదనే నమ్మకంతోటి ఊళ్లళ్ల అప్పులు పుట్టేవి. ఇప్పుడు పెట్టుబడికి ఇబ్బందిగా మారింది. మొన్న యాపల్‌గూడకు బీఆర్ఎస్ లీడర్లు వచ్చిండ్రు. మా బాధలు తెలుసుకున్నరు. రైతులందరికీ మేమున్నామని ధైర్యం ఇచ్చిండ్రు.

*- భగవాండ్లు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ మండలం*

## రైతుభరోసా రాలే



భీంపూర్, జనవరి 27 : కాంగ్రెస్ సర్కారు ఇగ ఎట్లయినా 26 జనవరి అర్ధరాత్రి నుంచి రైతుభరోసా పైసలు వస్తయి. ఫోన్లు టింగు టింగు మంటయి అని సీఎం సారు టీవీల చెబితే నమ్మినం. నాతో పాటు మా గ్రామంల రైతులంతా రాత్రి బారాబజే నుంచి ఫోన్ల డబ్బులు జమైనట్లు మెస్సేజ్‌ల కోసం ఎదురు చూసినం. తెల్లారే దాకా చూసినా మెస్సేజ్‌లు రాలే. ఇట్లా ఊకూకె మాట మార్చేటి సర్కారు మీద మేమంతా నారాజ్‌గానే ఉన్నము. రైతు, కూలీ ఇతరులందరికీ ఈ సర్కారు పద్ధతి నచ్చడం లేదు. మొన్న బీఆర్ఎస్ నాయకులు వచ్చి మేమున్నము అని ధైర్యం ఇచ్చిండ్రు.

*- గెడాం లక్ష్మణ్, అంతర్గాం, భీంపూర్ మండలం*

## డీఎం వేధిస్తున్నాడని విధుల బహిష్కరణ

ఆసిఫాబాద్ టౌన్,జనవరి 27 : ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ వేధింపులు భరించలేక సోమవారం ఆర్టీసీ కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఉదయం 4.30 గంటల నుంచి విధులు బహిష్కరించి డిపో ఆవరణలో నిరసన తెలిపారు. వేధింపులకు గురి చేస్తున్న డిపో మేనేజర్ విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌గౌడ్ మాట్లాడుతూ గతేడాది నుంచి ఆర్టీసీ డీఎం వేధింపులకు గురి చేస్తున్నారని, అవినీతికి పాల్పడుతున్న డీఎంకు ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

## తీరిన తాగు నీటి తిప్పలు

- బాల్క సుమన్ సహకారంతో సమస్యకు పరిష్కారం
- బోరుకు మోటర్ అమర్చిన మాజీ ఎంపీపీ లావణ్య
- జీపీలో నిధులు లేవన్న సెక్రటరీ
- పక్షం రోజులుగా అవస్థలు పడ్డ కాలనీ వాసులు

చెన్నూర్ రూరల్, జనవరి 26 : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ సహకారంతో సోమన్‌పల్లిలోని నేతకాని కాలనీలో తాగు నీటి తిప్పలు తీరాయి. పక్షం రోజుల క్రితం నేతకాని కాలనీలోని బోరుకు ఉన్న విద్యుత్ మోటర్ పాడైపోయింది. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీని సంప్రదిస్తే జీపీలో నిధులు లేవు.. అందుకే మరమ్మతులు చేయడం.. కొత్త మోటర్ ఏర్పాటు చేయడం కుదరని చెప్పారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక చేసేదేమీ లేక నేతకాని కాలనీ వాసులంతా మాజీ ఎంపీటీసీ తుమ్మల లావణ్య-తిరుపతి రెడ్డి వద్దకు వెళ్లి సమస్యను వివరించారు. ఆయన మాజీ విప్ బాల్క సుమన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆపై ఆయన ఆదేశాల మేరకు మాజీ ఎంపీటీసీ తుమ్మల లావణ్య-తిరుపతిరెడ్డి కొత్త మోటర్ ఏర్పాటు చేయించి తాగునీటి కష్టాలు తీర్చారు. ఇందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్పెషల్ ఆఫీసర్ (ఎంపీడీవో) మోహన్‌ను వివరణ కోరగా.. కొత్త జీపీల్లో నిధులు లేనందున మోటర్లు కొని ఇవ్వడం లేదని, పాడైపోయిన వాటికి మరమ్మతులు మాత్రమే చేపిస్తున్నామని తెలిపారు. కొత్త మోటర్ ఏర్పాటు చేసుకుంటే వారికి బిల్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.



కొత్త మోటర్ ఏర్పాటు చేసిన మాజీ ఎంపీటీసీ లావణ్య-తిరుపతి రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## మహానుభావులను మరువరాదు


**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

తిర్యాణి, జనవరి 27 : మహానుభావులను మరువరాదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం గిన్నేధరి గ్రామంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం హైమన్‌డార్ఫ్ శిష్యుడు, మానవ పరిమాణ శాస్త్రవేత్త మైఖేల్‌యార్క్ జన్మదినంను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ 1992లో ఆదివాసుల జీవన శైలీపై అధ్యయనం చేసి ప్రపంచానికి తెలియపరిచిన గొప్ప వ్యక్తి మైఖేల్ యార్క్ అని కొనియాడారు. 1972లో తిర్యాణి మండలం గిన్నేధరిలో నివాసముంటూ ఆదివాసుల సంస్కృతిపై అధ్యయనం చేసి అప్పటి ప్రభుత్వాలకు నివేదికలు అందజేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆదివాసులు అనేక రంగాల్లో రాణిస్తున్నారంటే అందుకు ఆయన విశేష కృషి ఉందన్నారు. ఆదివాసుల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో రమాదేవి,రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా రాయిసెంటర్ సర్మేడీ కుర్సెంగ మోతీరాం, ఆదివాసీ జాతీయ నాయకుడు సిడాం అర్జు, కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం భీంరావు, మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, ఆదివాసీ మహిళా సంఘం నాయకురాలు కమల, గిన్నేధరి సర్మేడీ ఆడ తానురావు, గిన్నేధరి బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నైతం కృష్ణారావు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ప్రజల మధ్యే ఉండాలి

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- పదవీకాలం పూర్తి చేసుకున్న బీఆర్ఎస్ నాయకులకు సన్మానం

మంచిర్యాలటౌన్, జనవరి 27 : పదవీకాలం ముగిసినా ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. సోమవారం సాయంత్రం మంచిర్యాలలోని తన నివాసంలో పదవీకాలం (జనవరి 26న) పూర్తి చేసుకున్న మున్సిపల్ ప్రజాప్రతినిధులను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంచిర్యాల, నస్పూరు, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన మున్సిపల్ చైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు శాలువాలు కప్పి, బహుమతులు అందించారు. ఐదేళ్ల పదవీకాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుకు చేసుకున్నారు. దివాకర్‌రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మంచి అవకాశాలు వస్తాయని, పార్టీ కోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, నస్పూరు, లక్షెట్టిపేట మున్సిపాలిటీల మాజీ చైర్మన్లు పెంట రాజయ్య, ఈసంపల్లి ప్రభాకర్, నలుమాసు కాంతయ్య, బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, అత్తి సరోజ, మందపల్లి స్వర్ణలత, శ్రీనివాస్, పల్లె భూమేశ్, సాగి వెంకటేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, పానగంటి సత్తయ్య, ఎర్రం తిరుపతి, పలువురు మాజీ కౌన్సిలర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేట మున్సిపల్ పాలక వర్గ సభ్యులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యను సన్మానిస్తున్న దివాకర్‌రావు

### మరోసారి గులాబీ జెండా ఎగరేద్దాం

లక్షెట్టిపేట(దండేపల్లి), జనవరి 27 : మున్సిపాలిటీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. పట్టణంలో మున్సిపల్ పాలకవర్గానికి నిర్వహించిన ఆత్మీయ సత్కారానికి ఆయన హాజరయ్యారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లక్షెట్టిపేట పట్టణంలో గులాబీ జెండా ఎగరేద్దామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, తాజా మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు నల్మాసు కాంతయ్య, పొడేటి శ్రీనివాస్‌గౌడ్, డీసీఎమ్మెస్ తిప్పని లింగన్న మాజీ డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పెట్టెం తిరుపతి, మంద శ్రీనివాస్, మోటపల్కుల గురువయ్య, నల్మాసు శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు.

## ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత

**రామగుండం సీపీ శ్రీనివాస్**

మంచిర్యాల అర్బన్, జనవరి 27 : ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని, సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం రామగుండంలోని తన కార్యాలయంలో ఉద్యోగోన్నతి పొందిన పోలీసులకు చిహ్నాలను అలంకరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందిన వారంతా ఎలాంటి రిమార్కు లేకుండా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీరాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘువేంద్రరావు, గోదావరఖని ఏసీపీ ఎం.రమేశ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్. ఆర్ఐ మల్లేశం, పోలీసుల అధికారుల సంఘం. అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, స్వామి పాల్గొన్నారు.



పోలీసుకు చిహ్నాన్ని అలంకరిస్తున్న సీపీ